తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యపేట యాద్రాద్రి భువనగిరి
బుధవారం 13 మే 2026 | పేజీలు : 8
Follow :

# ప్రాణాలు తీసే సిసి రోడ్డు

## రోడ్డు మధ్యలోనే విద్యుత్ స్తంభాలు అడ్డగోలుగా నిర్మాణం

## నిమ్మకు నీరెత్తినట్లు అధికారులు ఇందుగుల గ్రామస్తుల ఆగ్రహం



**మాడుగులపల్లి, మే 12 (జనం సాక్షి ):** అధికారుల పర్యవేక్షణ లోపిస్తే పనులు ఎంత అస్తవ్యస్తంగా ఉంటాయో అనడానికి మాడుగులపల్లి మండలంలోని ఇందుగుల గ్రామంలో సాగుతున్న రోడ్డు పనులే నిదర్శనం మాడుగులపల్లి నుంచి మామిడాల అడ్డరోడ్డు వరకు జరుగుతున్న రోడ్డు నిర్మాణంలో భాగంగా ఇందుగుల గ్రామంలో వేస్తున్న సిసి రోడ్డు పనుల్లో ఇంజనీరింగ్ అద్భుతం వెలుగు చూసింది రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించకుండానే, వాటి చుట్టూ సిసి రోడ్డు వేసి కాంట్రాక్టర్ తన పని కానిచ్చేశారు

### స్తంభాల నుంచి తప్పించుకోవాల్సిందేనా?

రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను అలాగే వదిలేయడం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, ఆటోలు ఆ స్తంభాలను తప్పించుకుంటూ ప్రయాణించాల్సి వస్తోంది రాత్రి వేళల్లో అటుగా వచ్చే ప్రయాణికులకు ఈ స్తంభాలు సరిగ్గా కనిపించక ప్రమాదాలు పొంచి ఉన్నాయి రోడ్డు నిర్మాణం అంటే ప్రజల ప్రయాణం సుఖమయం కావడానికి ఉండాలి కానీ, ఇలా ప్రాణ సంకటంగా మారుస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు

### కళ్లు మూసుకుపోయాయా?

లక్షల రూపాయల ప్రజా ధనంతో చేపడుతున్న ఈ పనులపై కనీస పర్యవేక్షణ లేకపోవడం విచారకరం రోడ్డు మధ్యలో స్తంభాలు కనిపిస్తున్నా అటు కాంట్రాక్టర్ గానీ, ఇటు విద్యుత్ పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి అధికారులు గానీ పట్టించుకోకపోవడం వెనుక పెద్ద ఎత్తున నిర్లక్ష్యం కనిపిస్తోంది పనులు త్వరగా పూర్తి చేసి బిల్లులు పొందే ఆరాటంలో ఉన్న కాంట్రాక్టర్లకు ప్రజల ప్రాణాలు పట్టవా అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

### వెంటనే చర్యలు చేపట్టాలి

అధికారుల నిర్లక్ష్యం వల్ల ఏ ఒక్కరి ప్రాణం పోయినా దానికి బాధ్యత ఎవరు వహిస్తారని స్థానికులు నిలదీస్తున్నారు ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని, రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే రోడ్డు పక్కకు మార్చి, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఇందుగుల గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



## మల్లాపురంలో రైతుల నిరసన

**యాదగిరిగుట్ట మే12 (జనంసాక్షి)** గత నెల రోజులుగా వరి ధాన్యాన్ని కొనుగోలు చేయట్లేదని కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్రంగా ఆరోపణలు చేస్తూ రైతులు నిరసన వ్యక్తం చేశారు. యాదగిరిగుట్ట మండలంలోని మల్లాపురం గ్రామంలో ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద వడ్ల బస్తాలను తగలబెట్టి వినూత్నంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. వెంటనే ప్రభుత్వం దిగివచ్చి వరి ధాన్యం కొనుగోలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో రోజురోజుకు ధాన్యం కొనుగోలు జరిగేదని కాంగ్రెస్ ప్రభుత్వంలో దాన్యం కొనుగోలు పట్టించుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కర్ర వెంకటయ్య , పట్టణ పార్టీ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, గ్రామ శాఖ అధ్యక్షుడు గౌడ శ్రీశైలం, రైతులు కర్రె చంద్రశేఖర్, ఒగ్గు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా చూడాలి

## మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి



**యాదాద్రి, కరస్పాండెంట్ మే 12 (జనంసాక్షి):** ధాన్యం, మొక్కజొన్న పంట కొనుగోళ్లపై నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై వెంటనే చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను హెచ్చరించారు. మంగళవారం మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి, ధనసరి అనసూయ (సీతక్క), అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు లతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించి, సమీక్షించారు.వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. జిల్లాలో ఉన్న ప్రతి ప్రైవేట్ గోదామును అవసరమైతే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని, అవసరమైన అన్ని చట్టాలను వినియోగించి నిల్వ సదుపాయాలను పెంచాలని సూచించారు. కమ్యూనిటీ హాళ్లు, రైతు బజార్లను తాత్కాలిక షెడ్లుగా వినియోగించాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీలు, ఉన్నత స్థాయి పోలీసు అధికారులు కొనుగోలు ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని, అవసరమైన వాహనాల ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలని సూచించారుకొనుగోళ్ల వ్యవహారంపై జిల్లా కలెక్టర్లు పూర్తి బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు మిషన్ మోడ్‌లో పని చేయాలని సీఎం ఆదేశించారు. ప్రతి రోజు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి కొనుగోళ్ల పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. కొనుగోళ్ల అంశాన్ని తేలికగా తీసుకునే అధికారులపై వెంటనే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతిరోజూ వివిధ సమస్యలపై రైతులు రోడ్డెక్కుతున్న పరిస్థితి రావొద్దని, రవాణా కోసం నిబంధనల ప్రకారం వాహనాలు ఇవ్వని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీఎం ఆదేశించారు. అనంతరం పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఈ యాసంగి సీజన్‌లో తెలంగాణ ప్రభుత్వం రికార్డు స్థాయిలో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కేవలం 52 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యాన్ని మాత్రమే నిర్దేశించిందన్నారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 25 లక్షల 78 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల వద్ద 11 లక్షల 52 వేల టన్నుల ధాన్యం పెండింగ్‌లో ఉందన్నారు. రైతులకు కనీస మద్దతు ధర చెల్లింపుల కోసం ఇప్పటివరకు రూ. 3,873 కోట్లను బ్యాంకుల ద్వారా విడుదల చేసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 18 కోట్ల 68 లక్షల గన్నీ సంచులను అందుబాటులో ఉంచామని, ఎటువంటి కొరత లేదని స్పష్టం చేశారు. హమాలీ చార్జీలను ఒక్కో సంచికి రూ. 8.50కు పెంచినట్లు చెప్పారు. వీసీ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యం లోడ్ లను ఎప్పటికప్పుడు దిగుమతి చేసుకొని కాంటా వేయాలని, కాంటా వేసిన వెంటనే ట్యాబ్ ఎంట్రీలు పూర్తి చేసి మిల్లులకు తరలించాలన్నారు. కేంద్రాల వద్ద కాని మిల్లుల వద్ద కాని హమాలీల సరిపడ లేకపోతే హమాలీల సంఖ్య పెంచి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ట్రాన్స్పోర్ట్ అధికారులు సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడి లారీల కొరత లేకుండా చూడాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స లో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా సివిల్ సప్లై మేనేజర్ హరికృష్ణ, జిల్లా సివిల్ సప్లై అధికారి రోజా రాణి, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి మురళి, ట్రాన్స్ జిల్లా ట్రాన్స్పోర్ట్ అధికారి సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో నిర్వహించిన హనుమాన్ జయంతి ఉత్సవాలు

**భువనగిరి, మే12 (జనంసాక్షి)**
భువనగిరి పట్టణంలోని 17వ వార్డు శ్రీరామ్ నగర్‌లో వెలసిన గోవింద క్షేత్రం ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించబడ్డాయి. ఆలయ ప్రాంగణం హనుమ నామస్మరణతో మారుమోగగా భక్తుల రద్దీతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.
ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, ఆకు పూజలు, విశేష అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ హాజరై స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆమెకు ఘన స్వాగతం పలికి సత్కరించారు.ఈ వేడుకల్లో 17వ వార్డు కౌన్సిలర్ చెన్న స్వాతి మహేష్, 33వ వార్డు కౌన్సిలర్ నాకోటి నరేష్, 32వ వార్డు కౌన్సిలర్ బర్రె సంఘవి కరుణాకర్ పాల్గొని భక్తులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.పూజల అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. శ్రీరామ్ నగర్‌తో పాటు పరిసర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారి



ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వార్డు ప్రముఖులు, యువకులు మరియు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.



**పోక్సో కేసులో బండి సంజయ్ కుమారుడిని వెంటనే అరెస్ట్ చేయాలి**

**మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి**

**భూదాన్ పోచంపల్లి, మే 12 (జనం సాక్షి):**
కేంద్ర సహాయ హోం శాఖ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథపై నమోదైన పోక్సో కేసులో వెంటనే అరెస్టు చేసి బాధితురాలికి న్యాయం చేయాలని మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఒక కేంద్ర సహాయ మంత్రి కుమారుడు మైనర్ బాలికపై అత్యాచారం ఆరోపణలు రావడం రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై అనేక అనుమానాలకు తావిస్తోందని ఇంత పెద్ద పోలీసు వ్యవస్థ ఉండి కూడా ఇప్పటివరకు అరెస్టు చేయకపోవడం వెనుక కారణాలేమిటో ప్రజలకు అర్థమవుతోంది అని అన్నారు. ఒక ప్రజాప్రతినిధిగా, కేంద్ర మంత్రిగా కుమారుడిని కంట్రోల్ చేయాలనీ వారు రాష్ట్రం, దేశానికి ఎలా నాయకత్వం వహిస్తారు అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో ప్రధాని సభలో నవ్వుతూ కనిపిస్తున్న నాయకులు, ఒక మైనర్ బాలిక జీవితంపై జరిగిన ఘటనపై స్పందించకపోవడం బాధాకరమని ఆయన అన్నారు. బాధితురాలికి పూర్తి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. బీజేపీ పార్టీ కూడా ఈ ఘటనపై బాధ్యత వహించాలని, ఇలాంటి ఘటనలను బీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పాటి సుధాకర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్ రెడ్డి, ధర్మారెడ్డిపల్లి సర్పంచ్ సామ రవీందర్ రెడ్డి, వార్డ్ కౌన్సిలర్ బాత్క లింగస్వామి, మాజీ కౌన్సిలర్ గుండు మధు, నాయకురాలు కర్నాటి అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

**హాలియా ఏప్రిల్ 12 జనంసాక్షి**
హనుమాన్ జయంతి వేడుకలు హ లియా భక్తాంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం నాడు హనుమాన్ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. రమేష్ బృందం హైదరాబాద్ వారిచే 108 హనుమాన్ చాలీసాను పారాయణం చేశారు ఆలయ అర్చకులు రమణ రమణ శర్మ వెంకటాచార్యులు భీష్మాచార్యులు వినోద్ శర్మ ఆధ్వర్యంలో అనంతరం 108 కలిశాలతో స్వామివారికి అభిషేకం వివిధ రకాల పూలతో తమలపాకులతో స్వామివారిని అలంకరణ. అనంతరం భక్తులకు దర్శనం ఇచ్చారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ సెల్ఫీ నేత కుందూరు జానారెడ్డి సుమతి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం మా అన్న సమారాధన భక్తులకు భావించారు భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రావు ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కర్నాటి లింగారెడ్డి. కాకు నూరు నారాయణ గౌడ్ ఆలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్ర రెడ్డి రాజా రమేష్ యాదవ్ కుందూరు వెంకటరెడ్డి. రైస్ మిల్లు అసోసియేషన్ అధ్యక్షులు చిట్టిపోలు యాదగిరి. చీద ళ్ళ లింగయ్య కౌన్సిలర్లు చిట్టి పూలు శ్రీదేవి కరుణాసాగర్ కో ఆప్షన్ నెంబర్ కొమ్మనబోయిన జయమ్మ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పక్షాన పోరాడుతాం

- మాజీ ఎమ్మెల్యే పైళ్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన పైళ్ళ
- సమస్యలను మొరపెట్టుకున్న రైతులు
- ఫోన్ చేసిన అందుబాటులోకి రాని అధికారులు



**బీబీనగర్ (జనంసాక్షి):** భువనగిరి నియోజకవర్గంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతుల ధాన్యాన్ని మరో వారం రోజుల్లోపు కొనుగోలు చేసి కేంద్రాల నుంచి మిల్లులకు తరలించకపోతే రైతుల పక్షాన పోరాటం చేస్తామని మాజీ ఎమ్మెల్యే పైల శేఖర్ రెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని ముద్దంపల్లి, పెద్దపలుగు తండా, చిన్న రావులపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాలలో ఐకెపి, పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వరి ధాన్యం కల్లాలకు వచ్చి నెలరోజులు కావస్తున్నప్పటికీ, పది శాతం ధాన్యం కూడా అధికారులు రైస్ మిల్లులకు చేరవేయలేకపోయారని రైతులు ఆయన ముందు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు పడితే పండించిన ధాన్యం చెడిపోతుందేమోనని తీవ్ర భయాందోళనలో ఉన్నామని, ధాన్యం నాణ్యంగా ఉన్నప్పటికీ సెంటర్లలో "ఏ గ్రేడ్" అని పేర్కొని, మిల్లులకు వెళ్లిన తర్వాత "బి గ్రేడ్"గా మార్చుతున్నారని రైతులు మొరపెట్టుకున్నారు.. దీంతో పైళ శేఖర్ రెడ్డి అధికారులతో ఫోన్‌లో సంప్రదించడానికి ప్రయత్నించినప్పటికీ ఎవరూ అందుబాటులోకి రాలేదు.. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీలోపు ధాన్యం పూర్తిగా లిఫ్ట్ చేయకపోతే, 16వ తేదీ నుండి సంబంధిత అధికారుల కార్యాలయాల ముందు, రోడ్లపై ధర్నా నిర్వహించి రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రైతుల సమస్యలను గాలికి వదిలేసిందని దీంతో రైతులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడింది అని, కనీసం రైతులకు రైతు భరోసా కూడా ఇవ్వలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని విమర్శించారు, రైతులు ఒకవైపు అప్పులు తెచ్చి పంటలు సాగు చేసినా ధాన్యం సకాలంలో అమ్ముకునే పరిస్థితి లేదని, రోజుల తరబడి కల్లాలలో రైతులు పడిగాపులు కాస్తున్న పరిస్థితి ఉందని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సత్వరమే ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ సుధాకర్ గౌడ్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు బొక్క జైపాల్ రెడ్డి, గాదె కవిత నరేందర్ రెడ్డి, మల్లగారి శ్రీనివాస్ మండల అధ్యక్ష ,కార్యదర్శులు రాచమల్ల శ్రీనివాసులు, చింతల సుదర్శన్ రెడ్డి, మండల నాయకులు పిట్టల అశోక్, స్వప్న రాజశేఖర్ గౌడ్, సర్పంచులు కొలను కృష్ణా రెడ్డి, హేమలత గణేష్, కొమిరి శ్రీకాంత్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సురుకంటి సుధాకర్ రెడ్డి, పాల్గొన్నారు.



## 15 రోజులలో ధాన్యం కొనుగోలు పూర్తి చెయ్యాలి

**త్వరగా దిగుమతి చేసుకోవాలని మిల్లర్లను ఆదేశించిన తహసీల్దార్ శ్రీనివాస రావు**

**నూతనకల్ మే12 (జనంసాక్షి)**
జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్ ఆదేశముల ప్రకారం మండలంలోని 25 ధాన్య కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యము రాబోయే 15 రోజులలో కొనుగోలు పూర్తి చెయ్యాలని తహసిల్దార్ పి శ్రీనివాసరావు ఆదేశించారు మంగళవారం ఎంపీడీవో సునీత ఎస్సై నాగరాజు గౌడ్ తో కలసి దిర్శనపల్లి పెదనేమిల కొనుగోలు కేంద్రాలు బిక్కుమళ్ళ చెక్ పోస్ట్ ను సందర్శించి పరిశీలించారు అక్కడ ఉన్న రైతులతో మాట్లాడగా వారు చెబుతూ లారీలు రాక కాంటాలు పూర్తయిన బస్తాలు నిల్వ ఉండడం జరుగుతుందని చెడువానలు వచ్చే పరిస్థితి ఉన్నందున రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆరు గాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి అష్ట కష్టాలు పడాల్సి వస్తుందని అధికారులకు విన్నవించారు ఈ సమస్యకు తక్షణమే పరిష్కారం చూపించాలని రైతులు కోరారు అధికారులు మిల్లర్లతో మాట్లాడుతూ దిగుమతి త్వరగా చేసుకోవాలని మిల్లర్లను కోరారు తూకం పూర్తయిన ధాన్యము వెంటనే మిల్లు నకు తరలించుటకు సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడి లారీలను ఏర్పాటు చెయ్యాలని అధికారులు చెప్పారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సునీత ఎస్సై నాగరాజు రెవిన్యూ పోలీసు సిబ్బంది ఐకెపి నిర్వాహకులు రైతులు పాల్గొన్నారు.

## బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు డాక్టర్ కోడి శ్రీనివాసులు

**చండూరు మే 12 (జనంసాక్షి)**



చండూరు మున్సిపాలిటీ పరిధిలో నిర్వహిస్తున్న బెల్ట్ షాపులను తొలగించాలని డాక్టర్ కోడి శ్రీనివాసులు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో చాలామంది బెల్ట్ షాపులను నిర్వహిస్తున్నారని, బెల్ట్ షాపులు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించడం వల్ల మున్సిపాలిటీలో రోడ్డు ప్రమాదాలు, గొడవలు, కొట్లాటలు జరిగి శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని అన్నారు. ఎక్సైజ్ అధికారులు, పోలీస్ శాఖ వారు బెల్ట్ షాపులపై నిఘా పెట్టాలని, నిర్వహించిన వారిపై కేసులు పెట్టి, జరిమానాలు విధించి, బైండోవర్లు చేయాలని అన్నారు. చండూరు మున్సిపాలిటీ పరిధిలో చాలా వీధులలో బెల్ట్ షాపులు దర్శనమిస్తున్నాయని, ఉదయం 05:00 గంటల నుండి మద్యం సేవించి చాలామంది మద్యానికి బానిసలు అయ్యారని అన్నారు. మద్యానికి బానిస కాకుండా కుటుంబాలు మరియు సమాజం బాగుండాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారు నిత్యం బెల్ట్ షాపుల నివారణకు పోరాటం చేస్తున్నారని గుర్తు చేశారు. వీరి వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ భూతరాజు దశరథ, కౌన్సిలర్లు కోడి సుష్మా వెంకన్న, తేలుకుంట్ల రాజకుమారి శేఖర్, కలిమికొండ పారిజాత జనార్ధన్, జెల్ల ధనమ్మ శ్రీనివాసులు,బుషిపాక వాసు, కటకం రమేష్, కొండ్రెడ్డి మధు, సామ సుజాత యాదవ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు కల్లెట్ల చంద్రకళ మారయ్య, ఖలీల్, సలీమా షరీఫ్, మొగదాల వెంకన్న ఉన్నారు.

### దొండపాడులో ఘనంగా హనుమాన్ జయంతి కార్యక్రమం

**చింతలపాలెం(జనంసాక్షి)**
సూర్యాపేట జిల్లా,చింతలపాలెం మండలం,దొండపాడు గ్రామంలో హనుమాన్ జయంతిని పురస్కరించు కొని అభయాంజనేయ స్వామి విగ్రహం దగ్గర ఆలయ నిర్వాహకులు బొబ్బా భాగ్య రెడ్డి దంపతులు మరియు గ్రామ ప్రజలు ఘనంగా పూజలు నిర్వహించ టం జరిగింది,అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో రామ భక్తులు,గ్రామ ప్రజలు,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# హనుమాన్ మాల విరమణ చేసిన భక్తులు

- రామయ్య దర్శనానికి పోటెత్తిన భక్తులు
- భద్రాచలంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు
- దాసాంజనేయస్వామి వారికి ఏకాంత విశేష సేవలు



**భద్రాచలం మే 12 (జనంసాక్షి)**
భద్రాచంలో అధిక సంఖ్యలో హనుమాన్ దీక్షల భక్తులు మాల విరమణ చేశారు. ఆంజనేయ స్వామివారికి అత్యంత ప్రీతివంతమైన వారం మంగళవారం కావడం అదేరోజు ఆంజనేయ స్వామి వారి జయంతి రావడం ప్రత్యేకత సంతరించుకుంది. తెల్లవారుజామున 3 గంటలకే రామాలయాన్ని తెరిచి సుప్రభాత సేవ నిర్వహించారు. అదేవిధంగా హనుమాన్ దీక్షితులు వేకువ జాము నుంచే పవిత్ర గోదావరి నదికి చేరుకొని పుణ్య స్నానాలు ఆచరించారు. జై శ్రీరామ్. జై హనుమాన్, జై శ్రీరామ్ జైజై శ్రీరామ్ అంటూ మస్మరణతో తమ ఆరాధ్య దైవమైన భద్రాద్రి రామయ్యను దర్శించుకునేందుకు భక్తులు క్యూలైన్లలో వేచి ఉన్నారు. హనుమాన్ దీక్షితులు తమ శిరస్సుపై ఇరుముడి ధరించి తెల్లవారుజామున మూడు గంటల నుంచే క్యూ లైన్లలో బారులు తీరారు. స్వామి వారిని దర్శించుకున్న తరువాత ఇరుముడిని అంజనే యస్వామి ఆలయంలో సమర్పించారు. కాగా భద్రాద్రి రామాలయ ఈవో కె దామోదరరావు, దేవస్థానం అధికారులు హనుమాన్ భక్తుల కోసం శీఘ్ర దర్శనం, దేవస్థానం ఉచిత నిత్యన్నదాన సత్రంలో అన్న ప్రసాద అందిచేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వరంగల్, కరీంనగర్, నిజామా బాద్, ఆదిలాబాద్ తదితర ఉమ్మడి జిల్లాల నుంచి వేల సంఖ్యలో తరలొచ్చారు. సుమారు 30 వేల మంది హనుమాన్ దీక్షితులు దర్శించుకున్నట్లు దేవస్థానం వర్గాలు అంచనా వేస్తున్నాయి. అలాగే దాసాంజనేయస్వామికి ఏకాంత విశేష స్నపనం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు భద్రాదలంలోని బ్రిడ్జి సెంటర్ వద్ద ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో కూడా దీక్షా విరమణ గావించారు. ఈ సందర్భంగా అభయాంజనేయ స్వామి ఆలయంలో వైదిక సిబ్బంది సమక్షంలో హనుమాన్ దీక్షితుల విరమణ కోసం ప్రత్యేక పూజ, హనుమత్ హోమం, సామూహిక సహస్రనామార్చన పూజలు నిర్వహించారు. హనుమాన్ భక్తులు దీక్షా విరమణ గావించారు. తాతగుడి సెంటర్లో, వెంకటేశ్వర కాలనీలోని ఆంజనేయస్వామి వారి ఆలయాల్లో కూడా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు అన్నదానం నిర్వహించారు.

## పీసా చట్టం గ్రామసభ తీర్మానం లేకుండానే పిల్లకాలువలు తీసేందుకు భూముల సర్వే

- 'సీతారామ' పిల్ల కాలువలు వెళ్లకుండా నిలుపుదల చేయాలి - వేపలగడ్డ గిరిజన రైతుల వినతి



**బూర్గంపహాడ్ మే 12 (జనంసాక్షి)**
పీసా చట్టం గ్రామసభ తీర్మానం లేకుండా మా భూముల మీదుగా సీతారామ ప్రాజెక్టు పిల్ల కాలువలు తీసేందుకు సర్వే నిర్వహించడం పట్ల మండల పరిధిలోని వేపలగడ్డ గిరిజన రైతులు ఆదివాసీ మండల నాయకులు మెండి భాస్కర్తో కలిసి మంగళవారం భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో పీవో రాహుల్, ఆర్డీవో, బూర్గంపహాడ్ తహశీల్దార్ కేఆర్ కె ప్రసాద్లను వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు సమర్పించారు. సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన పిల్ల కాలువలు తమ భూముల మీదుగా వెళ్లనీయకుండా నిలుపుదల చేసి న్యాయం చేయాలని ఆ వినతిలో అధికారులను కోరారు. జనవరి 2026 నుంచి రైతులకు ఎలాంటి సమాచారం, పీసా చట్టం గ్రామసభ తీర్మానం లేకుండా సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి పిల్ల కాలువలు తీయడానికి గ్రామంలో భూముల సర్వే నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే తమకు ఉన్న భూమిలో కొంత మేరకు సీతారామ ప్రాజెక్టు కాలువ, కిన్నెరసాని కాలువల కోసం ఇచ్చామని...ఇప్పుడు ఎకరం, అరెకరం మాత్రమే కలిగి ఉన్న భూముల్లో పిల్ల కాలువలు అవసరంలేదని, దీనివల్ల మా భూములకు నష్టం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సర్వేను నిలిపివేసి భూములు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. దీనికి ఐటీడీఏ పీవో స్పందించి గ్రామంలో పీసీ చట్టం గ్రామసభనిర్వహించి గిరిజన రైతుల భూములు నష్టపోకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. వినతిపత్రాలు అందజేసిన వారిలో ఆదివాసీ మండల నాయకులు మెండి భాస్కర్ తో పాటు వేపలగడ్డకు చెందిన గిరిజన రైతులు ఉన్నారు.

## పోచంపల్లి ఎంపీడీఓగా సత్యనారాయణ రెడ్డి అదనపు బాధ్యతలు

ప్రస్తుత ఎంపీడీఓ ఆర్. భాస్కర్‌కు జనగామ జిల్లా డీఆర్‌డీఓగా పదోన్నతి



**భూదాన్ పోచంపల్లి, మే 12 (జనంసాక్షి):**
యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ)గా విధులు నిర్వహిస్తున్న ఆర్. భాస్కర్ జనగాం జిల్లా డీఆర్‌డీఓగా పదోన్నతి పొందిన నేపథ్యంలో, జడ్పీ సీఈఓ ఆదేశాల మేరకు ప్రస్తుత సూపరింటెండెంట్ ఎ. సత్యనారాయణ రెడ్డికి ఎంపీడీఓగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆర్. భాస్కర్‌ను మంగళవారం విధుల నుండి అధికారికంగా విడుదల చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు కలిసి ఆయనకు ఘనంగా సన్మానం నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు.



## ఇరవెండిలో ఆరోగ్యంపై అవగాహన

వడదెబ్బ నివారణకు సూచనలు

**బూర్గంపహాడ్ మే 12 (జనంసాక్షి)**
బూర్గంపహాడ్ మండలం ఇరవెండి గ్రామం పల్లె దవాఖానాలో గ్రామ ఆరోగ్యం, పారిశుద్ధ్యం, పోషకాహారం, అసాంఘిక వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గుండి బాబురావు ముఖ్య అతిథిగా హాజరై వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా ప్రజలు వడదెబ్బ బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, అలాంటి సమయంలో ఓఆర్ఎస్ వినియోగం ఎంత ముఖ్యమో ప్రజలకు వివరించారు. అసాంఘిక వ్యాధులు ఒకరి నుంచి మరొకరికి అంటుకోవని, బాధితులను చిన్నచూపు చూడకుండా వారికి మానసిక ధైర్యం ఇవ్వాలని అవగాహన కల్పించారు. ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్హెచ్‌పీ జ్యోతి, ఏఎన్ఎం సుందర వేణి, ఆశా వర్కర్లు, మొదటి వార్డు సభ్యురాలు కేలోత్ దుర్గ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆంజనేయ స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి



**సూర్యాపేట(జనంసాక్షి):**
ఆంజనేయ స్వామి వారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు.మంగళవారం జిల్లా కేంద్రంలోని తహశీల్దార్ ఆఫీస్ సమీపంలోని శ్రీభక్తాంజనేయ స్వామి వారి దేవాలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధైర్యం, భక్తి, సేవాభావానికి ప్రతీక అయిన ఆంజనేయ స్వామి వారి అనుగ్రహంతో ఇబ్బందులు తొలగిపోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, గుణగంటి హేమ సతీష్, దేవాలయ చైర్మన్ కొత్త ఆంజనేయులు, ఈవో లక్ష్మణరావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పొలగాని బాలు గౌడ్, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, శ్రీదండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఏలిమినేటి అభినయ్ నాయుడు, జిల్లా కాంగ్రెస్ నాయకులు రాచకొండ శ్రీనివాస్, నారాయణ ప్రవీణ్ రెడ్డి,మద్దెబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆడపడుచులకు అండగా కల్యాణలక్ష్మి

### సర్పంచ్ కొలిశెట్టి రాంబాయమ్మ

**మునగాల, మే 12(జనంసాక్షి):**
పేదింటి ఆడపడుచులకు అండగా కల్యాణలక్ష్మి ఉన్నదని తాడ్వాయి గ్రామ సర్పంచ్ కొలిశెట్టి రాంబాయమ్మ బుచ్చిపాపయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తాడ్వాయి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జిల్లేపల్లి వెంకటయ్యకు కల్యాణలక్ష్మి చెక్కును ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళలు కల్యాణలక్ష్మి డబ్బులను వృథా చేయకుండా అవసరానికి వినియోగించుకోవలన్నారు. కోదాడ ఎమ్మెల్యే యన్ పద్మావతిరెడ్డి సహకారంతో గ్రామాన్ని మండలంలో ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలిశెట్టి బుచ్చిపాపయ్య, 9వ సభ్యులు జిల్లేపల్లి సుమన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కోండమీది లక్ష్మీనారాయణ, మునుకుంట్ల శీను, వల్లోజ్ శీను, గట్టు వెంకటేశ్వర్లు, వీరమళ్ల వెంకటేశ్వర్లు, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.



జనంసాక్షి

# వైద్య రంగంలో కీలకమైనది నర్సు వృత్తి

## లైన్స్ క్లబ్ అధ్యక్షులు పాలవరపు సంతోష్, సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు..

**తుంగతుర్తి మే 12 (జనంసాక్షి)**
వైద్యరంగంలో నర్సు వృత్తి కీలకమైందని ఇది సమాజంలో గౌరవాన్ని అమ్మ తనాన్ని పెంచి పోషిస్తుందని తుంగతుర్తి లయన్స్ క్లబ్ అధ్యక్షులు పాలవరపు సంతోష్, సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు అన్నారు, మంగళవారం మండల కేంద్రంలో ప్రపంచ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న నర్సులను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విశ్రాంతి ఉద్యోగుల సంఘ భవనంలో ఘనంగా సన్మానించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక నర్సింగుకు మార్గదర్శకురాలిగా సాధారణంగా పరిగణించబడే ఫ్లోరెన్స్ నైటింగేల్ జన్మదినాన్ని పురస్కరించుకొని నర్సుల దినోత్సవాన్ని జరుపుకోవడం సంతోషకర విషయం అని అన్నారు, వివిధ రోగాలతో ఆసుపత్రులకు వచ్చే రోగులకు స్నేహపూర్వకంగా ఆత్మీయతతో కూడిన అభిమానాన్ని పంచి వారికి సేవ చేస్తున్న నర్సుల పాత్ర సమాజం ఎప్పటికీ మరువదని అన్నారు, సమాజంలో ఆరోగ్య సంరక్షణ కోసం వారు చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు, ఆసుపత్రిలో నర్సులు అంకితభావంతో పనిచేసినప్పుడు గుర్తింపు లభిస్తుందని, వారు చేస్తున్న సేవలు మరువలేనివని అన్నారు, తల్లి ఒక బిడ్డను ఏ విధంగా సౌరక్షించుకుంటుందో, అదేవిధంగా దవాఖానకు వెళ్ళిన రోగులను నర్సుల సేవలు అందిస్తారని కొనియాడారు. ప్రతి నర్సు రోగుల పట్ల అంకితభావంతో పనిచేసినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని, పనిచేస్తున్న నర్సులకు ఎల్లవేళలా లైన్స్ క్లబ్ సేవలు అందుబాటులో ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు,ఈ మేరకు సీనియర్ నర్సులు అయిన సింగం సునీత, నాగలక్ష్మి, అనిత, కవిత, శారద లను శాలువాలతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ నిర్మల్ కుమార్, తుంగతుర్తి లైన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు తల్లాడ కేదారి, కోశాధికారి గుండ గాని రాము కోఆర్డినేటర్లు ఓరుగంటి శ్రీనివాస్, ఎనగందల గిరి, గుడిపూడి లక్ష్మణరావు, పులుసు వెంకటనారాయణ గౌడ్, గుజ్జా భాస్కర్, వాసం అభిలాష్, ఆరోగ్య సిబ్బంది సతీష్, తదితరులు పాల్గొన్నారు.




## బండి భగీరథ్ ను తక్షణమే అరెస్టు చేయాలి
## బీఆర్ఎస్ శ్రేణుల నిరసన

**బూర్గంపహాడ్ మే 12 (జనంసాక్షి)**



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ను పోక్సోకేసులో తక్షణమే అరెస్టు చేయాలంటూ బీఆర్ఎస్ శ్రేణులు నిరసన వ్యక్తం చేశాయి. మంగళవారం మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పిలుపుమేరకు బూర్గంపహాడ్ మండలం సారపాక బీఆర్ఎస్ పట్టణ కమిటీ అధ్యక్షుడు కొనకంచి శ్రీను ఆధ్వర్యంలో సారపాక ప్రధాన సెంటర్ లో బీఆర్ఎస్ నాయకులు నల్ల కండువాలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన బండి భగీరథ్ను అరెస్టు చేయకుండా ప్రభుత్వం, పోలీసులు తాత్సారం చేస్తున్నారని... సంఘటన జరిగి రోజులు గడుస్తున్నా ఇంతవరకు అరెస్టు చేయకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ కుమారుడు ఇలాంటి సిగ్గుమాలిన పనిచేయడం పట్ల మహిళాలోకం ఆగ్రహం వ్యక్తం చేస్తుందన్నారు. తక్షణమే బండి బగీరథ్ పై పోక్సో కేసు పెట్టి అరెస్టు చేయాలని, అదేవిధంగా తన కుమారుడి చర్యలకు నైతిక బాధ్యత వహిస్తూ బండి సంజయ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్, మహిళా నాయకులు, బీఆర్డీయూ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా దర్బార్‌ను సద్వినియోగం చేసుకోండి
### మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి

**ఖమ్మం రూరల్, మే 12(జనంసాక్షి):**



ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించనున్న ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.మంగళవారం ఎదులాపురం మున్సిపాలిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల14 గురువారం సత్యనారాయణపురంలోని టీసీవీ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఉదయం 8 గంటల నుంచి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. వార్డు నెంబర్ 1, 2, 3, 4, 5, 18, 19, 20, 21, 22, 23, 24, 30, 31, 32 వార్డులకు చెందిన ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని,చేయూత పెన్షన్లు, ఇందిరమ్మ ఇండ్లు, ఇంటి స్థలం, గృహజ్యోతి,రేషన్ కార్డులు, భూ భారతి, రైతు భరోసా, మహాలక్ష్మి, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, స్త్రీ శక్తి రుణాలు తదితర సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి పరిష్కార చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ప్రజలు అవసరమైన ధృవపత్రాలతో హాజరై కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# రూ.20 లక్షల భీమా క్లైయిమ్ చెక్కు అందజేత

**"భీమా అంటే ఖర్చు కాదు.. కుటుంబ భవిష్యత్తుకు భరోసా"**
**ప్రాంతీయ మేనేజర్ నాగరాజు**

**బూర్గంపహాడ్ మే 12 (జనంసాక్షి)**




ఎస్ బి ఐ జనరల్ ఇన్సూరెన్స్ జి పి ఏ ఐ పథకం ద్వారా మృతుడు సోడె నరేష్ కుటుంబ సభ్యులకు రూ.20 లక్షల మరణ భీమా క్లెయిమ్ చెక్కును నామినీ సోడె గోపయ్యకు అందజేశారు. కుటుంబాలకు ఆర్థిక రక్షణ కల్పించడంలో భీమా పథకాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ప్రాంతీయ మేనేజర్ నాగరాజు అన్నారు. బూర్గంపహాడ్ లోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ నందు నిర్వహించిన కార్యక్రమంలో బుడ్డగూడెం గ్రామానికి చెందిన మృతుడు కుటుంబ సభ్యులకు రూ.20 లక్షల మరణ భీమా క్లెయిమ్ చెక్కును నామినీకి అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ నాగరాజు మాట్లాడుతూ జీవితంలో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందో ముందుగా చెప్పలేమని, అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో కుటుంబానికి ఆర్థిక అండగా నిలిచేది భీమా పథకాలేనని అన్నారు. చిన్న మొత్తంలో ప్రీమియం చెల్లించడం ద్వారా కుటుంబ భవిష్యత్తుకు పెద్ద భరోసా పొందవచ్చని తెలిపారు. ఎస్బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ అందిస్తున్న జీవిత భీమా పథకాలు కుటుంబాలకు రక్షణ కవచంలా నిలుస్తాయని ఆయనన్నారు. కుటుంబ పెద్దకు అనుకోని ప్రమాదం జరిగినా పిల్లల చదువు, కుటుంబ అవసరాలు ఆగిపోకుండా ఈ పథకాలు ఆదుకుంటాయని వివరించారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి జీవన్ జ్యోతి భీమా యోజన, ప్రధానమంత్రి సురక్షా భీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలు సామాన్య ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. తక్కువ ప్రీమియంతో జీవిత భీమా, ప్రమాద భీమా, వృద్ధాప్య భద్రత పొందవచ్చని తెలిపారు."భీమా తీసుకోవడం అనేది ఖర్చు కాదు.. కుటుంబ భవిష్యత్తుకు పెట్టుబడి" అని పేర్కొంటూ ప్రతి ఒక్కరూ భీమా పథకాలలో చేరి తమ కుటుంబాన్ని ఆర్థికంగా రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మందా నాగరాజు, స్థానిక తెలంగాణ గ్రామీణ బ్యాంక్ శాఖ మేనేజర్ ప్రసాద్, ఖాతాదారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పంచముఖ హనుమాన్ ఆలయంలో జయంతి వేడుకలు

**మేళ్లచెరువు మండలం ( జనంసాక్షి)**



జై శ్రీరామ్ అనే నినాదంతో మారుమోగిన ఆలయంమేళ్లచెరువు లో వేంచేసి ఉన్నటువంటి పంచముఖి దేవాలయంలో మంగళవారం హనుమాన్ జయంతి పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా కనుల పండుగ జరిగాయి సువర్చల సమేత ఆంజనేయస్వామి వారి కి శాంతి కళ్యాణ మహోత్సవం, , భక్తుల సహాయ సహకారాలతో మహా అన్నదాన ప్రసాద అత్యంత వైభవముగా జరిగాయి ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ శెట్టి. రాజ్ కుమార్ , ఆలయ పూజారి సుదర్శన మోహన కృష్ణచార్యులు, కృష్ణ ప్రసాద్ ,సేవకులు, భక్తులు పాల్గొని విజయవంతం చేశారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు
### ప్రత్యేక పూజలు నిర్వహించిన నాయకులు



**సూర్యాపేట(జనంసాక్షి):**
హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం సూర్యాపేట పట్టణంలోని శాంతి నగర్ లో అభయాంజనేయ స్వామి వారి దేవాలయంలో ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.హనుమాన్ జయంతి సందర్భంగా స్వామి వారికి లక్ష తమలపాకులతో ప్రత్యేక పూజలు, లక్ష మల్లెల అర్చన, అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం చైర్మన్ కొత్త రామ నరసయ్య ఆండాలు, కొత్త పవన్ కుమార్ నాగ భార్గవి, మున్సిపల్ కౌన్సిలర్లు చిలుముల సునీల్ రెడ్డి, కొండపల్లి దిలీప్ రెడ్డి, గుణగంటి హేమ సతీష్, మాజీ కౌన్సిలర్ మాలోతు చంద్రు నాయక్, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ధరావత్ వీరన్న నాయక్, శ్రీదండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఏలిమినేటి అభినయ్ నాయుడు, జిల్లా కాంగ్రెస్ నాయకులు రాచకొండ శ్రీనివాస్, నారాయణ ప్రవీణ్ రెడ్డి,మద్దెబోయిన శ్రీనివాస్, నాగు నాయక్, వాజిద్ మియా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బూర్గంపహాడ్ లో హనుమాన్ జయంతి
### మహా అన్నదాన కార్యక్రమం

**బూర్గంపహాడ్ మే 12 (జనంసాక్షి)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల కేంద్రంలో శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు అర్చకులు, పాలకమండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు సత్యవ్రతలు, వాసు లు తెల్లవారుజామున 4 గంటలకు స్వామివారికి అభిషేకాలు నిర్వహించి, ఉదయం 6 గంటలకు స్వామివారి అలంకరణ, తదుపరి ఆలయ స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం, గోత్రనామాల తో అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి కరుణా కటాక్షాలకు పాత్రులయ్యారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. వచ్చిన భక్తులు మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు ప్రముఖ (ఆర్థోపెడిక్) వైద్య నిపుణులు చంద్ర కృష్ణ ప్రసాద్ దంపతులు, భక్తుల విరాళాలతో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పాలకమండల సభ్యులు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి అశేషంగా తరలివచ్చిన భక్తులుకు ఎల్లవేళలా స్వామివారి కృపాకటాక్షాలు కలగజేయాలని కోరుకున్నట్లు తెలిపారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



**సూర్యాపేట(జనంసాక్షి):**
జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో గల శ్రీరామలింగేశ్వర సహిత త్రిశక్తి అయ్యప్ప ఆంజనేయ స్వామి వారి దేవాలయంలో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రధాన అర్చకులు రెంటాల సతీష్ కుమార్ శర్మ, దుర్గాప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామివారికి మహా పంచామృత అభిషేకం, అలంకరణ సేవ నిర్వహించారు. స్వామివారికి నాగవెల్లి దళార్చన, పుష్పార్చన నిర్వహించారు. స్వామి వారుకి ప్రీతికరమైన వడపప్పు, బెల్లం పానకం, వడలు నైవేద్యంతో పాటు 16 రకాల ప్రసాదాలను సమర్పించి భక్తులకు వితరణ చేశారు. సాయంత్రం దేవాలయంలో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అనంతుల గణేష్ రామలింగయ్య, ధర్మకర్తలు అనంతుల సూర్యనారాయణ, అనంతుల దుర్గాప్రసాద్, అనంతుల శ్రీనివాస్, అనంతుల యుగేందర్, సందీప్, సత్యనారాయణ, డైమండ్ జ్యువెలరీస్ పోలిశెట్టి శ్రీనివాస్, సూర్యాపేట హాస్పటల్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, రక్ష హాస్పిటల్ పాపిరెడ్డి, తీగల ఉపేందర్, ప్రతిభ జూనియర్ కళాశాల కె.సత్యంబాబు, కె.వెంకటరెడ్డి, తెడ్ల ప్రభాకర్, చల్లా లక్ష్మీకాంత్, చల్లా లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ కార్మికులకు పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

**కోదాడ,( జనంసాక్షి):**
కోదాడ మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కోటగిరి వెంకట నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోదాడ పట్టణంలో మున్సిపల్ కార్మికుల పెండింగ్ వేతనాలు , బట్టల కుట్టు కూలి కొబ్బరినూనె ఇవ్వాలని స్థానిక మున్సిపల్ కమిషనర్ రమాదేవి మెమోరండం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ
కోదాడ పట్టణంతో పాటు జిల్లాలో అనేక మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ కార్మికులకు కొన్ని నెలల పాటు పెండింగ్ వేతనాలను విడుదల చేయకుండా ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఇచ్చే తక్కువ వేతనంతో కుటుంబం గడిచే పరిస్థితి లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని కాబట్టి క్యాటగిరి వారిగా జీతాలు చెల్లించాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఔట్సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని సిఐటియు ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలునిర్వహిస్తున్నామని వారన్నారు. చనిపోయిన మున్సిపల్ కార్మికులకు 20 లక్షల ఎక్సిలేసియా ఇచ్చి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, వారన్నారు దేశంలో బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ లు రద్దు చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ప్రతినెల 5వ తేదీన జీతాలు చెల్లించాలని వారు ఉన్నారు ఈ యొక్క కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం ముత్యాలు, యూనియన్ అధ్యక్షులు కొమ్ము నాగేశ్వరరావు కుడుముల గోపి ఎం నాగమణి దేవిక, సునీత, శ్రీను, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.




## నాయి బ్రాహ్మణ ఫెడరేషన్ కి చైర్మన్ ని నియమించాలి

### క్షౌర వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెన్నారం మల్లేష్

**రామన్నపేట, మే 12 (జనంసాక్షి):**
నాయి బ్రాహ్మణ ఫెడరేషన్ కి చైర్మన్ ని నియమించాలని క్షౌర వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెన్నారం మల్లేష్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండలంలోని కక్కిరేణి గ్రామంలో క్షౌర వృత్తిదారుల సమస్యలపై నిర్వహించిన గ్రామ ముఖ్య కార్యకర్తల సమావేశం వేముల దయాకర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్లేష్ హాజరై మాట్లాడుతూ... రాష్ట్రంలో జనాభా ప్రాతిపదికన మేమూ ఎంతో మాకు అంత వాటా కేటాయించి వెంటనే నాయి బ్రాహ్మణ ఫెడరేషన్ చైర్మన్ తో పాటు జిల్లాకో డైరెక్టర్ ని నియమిస్తూ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ఇచ్చిన హామీల అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో నాయి బ్రాహ్మణ , వృతి దారుల పట్ల సామజిక కుల వివక్ష తో దాడులు జరుగకుండా వృత్తి రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వృత్తిదారులు కేవలం కేశాలంకరణ కే పరిమితం కాకుండా సమాజంలో మంగళ వాయిద్యాలు ఆధ్యాత్మిక కార్యక్రమాలలో కీలకపాత్ర పోషిస్తున్నారని గుర్తు చేశారు. అలాగే ఆధునిక పరికరాలపై అవగాహన, వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు . ఇలా రకాలుగా ఇబ్బంది పడుతున్న పలు సమస్యలపై నిరంతరం పోరాట కార్యక్రమాలు రూపొందిస్తూ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్షౌర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల సైదులు నల్లగొండ జిల్లా అధ్యక్షులు చెన్నారపు సత్తయ్య గ్రామ నాయకులు వేముల దుర్గయ్య , రాము , నరేష్ , మచ్చ గిరి , అనిల్ , వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఘన సన్మానం

**కనగల్లు, మే 12 (జనంసాక్షి)**
ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించి పదవ తరగతిలో 500 పైచిలుకు మార్కులను సాధించిన విద్యార్థులను అధికారులు ఘనంగా సన్మానించారు . మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో



ఏర్పాటుచేసిన ప్రతిభ పురస్కార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్ కార్యనిర్వానధికారి ప్రేమ్ కరుణ్ రెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివి పదవ తరగతి ఫలితాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఇదే ఉత్సవాన్ని ఉన్నత చదువులలో కూడా చూపించాలని పేర్కొన్నారు . విద్యార్థులు తల్లిదండ్రులు చూపిన మార్గములో నడుస్తూ ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను అర్థం చేసుకొని ప్రభుత్వము నిర్వహించే ప్రతి పరీక్షల లో ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలియజేశారు. ప్రస్తుతం విద్య విధానంలో పెను మార్పులు వస్తున్నందున వాటికనుగుణంగా విద్యార్థులు తమ ప్రణాళికను సిద్ధం చేసుకుని ముందుకు సాగాలని కోరారు. పది ఫలితాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు కే దినేష్ కుమార్ చర్లగౌరారం, సిహెచ్ వైష్ణవి చిన్న మాదారం, బి పవన్ సాయి దోరేపల్లి, బి దేవిప్రియ జి యడవల్లి, కే మమత కనగల్లు, ఆర్ కావ్య శ్రీ కేజీవీబీ కనగల్లు, వి ఝాన్సీ మోడల్ స్కూలు కనగల్లు, కే వర్షాశ్రీ కురంపల్లి, ఏ దయాకర్ రేగట్టే లకు అధికారులు ప్రశాంశ పత్రాల తో పాటు మెమోటోలను అందజేశారు. కురంపల్ సర్పంచ్ ఓర్సు పెంటయ్య తమ గ్రామ పంచాయతీ చెందిన కే వర్ష శ్రీ కి 5000 రూపాయల నగదు పురస్కారాన్ని అందజేసి అభినందించారు. కే మమత, ఆర్ కావ్య శ్రీ లకు కనగల్ సర్పంచ్ నర్సింగ్ మురళీధర్ గౌడ్ ఒక్కొక్కరికి 5000 రూపాయల నగదును అందజేసి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏ వేద రక్షిత, ఎంఈఓ పద్మ, ఎంపీఓ సతీష్ కుమార్, ఆయా గ్రామ పంచాయతీల పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పదిలో తప్పిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

### ఎంఈఓ రాములు నాయక్

**నూతనకల్ మే 12(జనంసాక్షి)**
మండల కేంద్రంలోని పీఎం శ్రీ ఉన్నత పాఠశాల నూతనకల్ లో 10వ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు 2026 సప్లమెంటరీ పరీక్షల కొరకు వారి సబ్జెక్టులలో ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఎంఈఓ రాముల నాయక్ అన్నారు మంగళవారం వారు మాట్లాడుతూ సబ్జెక్టు వారీగా సబ్జెక్టు టీచర్లతో క్లాసులు చెప్పడం జరుగుతుందని ఇట్టి సువర్ణ అవకాశాన్ని మండల వ్యాప్తంగా విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు ఇట్టి కార్యక్రమంలో




పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు సిఆర్పిలు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## పెరికకుల కార్పొరేషన్ ఏర్పాటు చారిత్రాత్మకం

### జిల్లా ప్రధాన కార్యదర్శి కోట సుధాకర్



**రామన్నపేట, మే 12 (జనంసాక్షి):**
తెలంగాణ రాష్ట్రంలో పెరిక కుల కార్పొరేషన్ ఏర్పాటు కావడం పెరిక సమాజ చరిత్రలో మైలు రాయిగా నిలిచిందని యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి కోట సుధాకర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రులు పొన్నం ప్రభాకర్ కు, ఉత్తం కుమార్ రెడ్డి కి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అర్హులైన నాయకులను ప్రభుత్వం ఎంపిక చేయడం అభినందనీయమని, కార్పొరేషన్ ద్వారా పెరిక కుల అభివృద్ధికి కట్టుబడి పనిచేయాలని వారు సూచించారు. రాష్ట్ర పెరిక కుల కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు (డి.వి), వైస్ చైర్మన్ బుడిగం శ్రీనివాస్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. సమావేశంలో స్థానిక సర్పంచ్ గరిక సత్యనారాయణ, పెరికకుల పట్టణ అధ్యక్షులు ఉగే రాజేష్ మరియు కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



**నూతనకల్ మే12 (జనంసాక్షి)**
మండల కేంద్రంలోని శంభు లింగేశ్వర స్వామి దేవస్థానం నుండి సూర్యాపేట దంతాలపల్లి మెయిన్ రోడ్డు లో హనుమాన్ శోభయాత్ర నిర్వహించారు ఈ సందర్భంగా మంగళవారం హనుమాన్ భక్తులు మాట్లాడుతూ అపారమైన శక్తికి నిస్వార్థ భక్తికి ప్రతీక ఈ రోజు మంగళవారం హనుమంతుడిని పూజించడం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుంది కష్టాల తగ్గుతాయని హనుమజ్జయంతి నాడు హనుమాన్ చాలీసా సుందరకాండ పారాయణం చేయడం వల్ల గ్రహ దోషాలు ముఖ్యంగా శని దోషం శత్రు భయం అనారోగ్య సమస్యలు తొలగిపోతాయని వారి విశ్వాసం. సింధూర పూజ ఆంజనేయ స్వామికి సింధూరం అంటే అత్యంత ప్రీతి అని భక్తులు తెలిపారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్ భక్తులు కాప రవికుమార్ బొడ్డుపల్లి అంజయ్య సురకంటి చంద్రారెడ్డి మహిళలు పురుషులు అధిక సంఖ్యలో పాల్గొని హనుమాన్ జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.

## తుంగతుర్తిలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

**తుంగతుర్తి మే 12 (జనంసాక్షి)**
తుంగతుర్తి మండల కేంద్రంలో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు, ఈ మేరకు పలు గ్రామాలలో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయాలను ప్రత్యేకంగా రంగు రంగు పూలు పచ్చని తోరణాలు విద్యుద్దీపాలతో అలంకరించారు ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు చేరుకునే ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకునే తీర్థప్రసాదాలు స్వీకరించారు తుంగతుర్తి లోని అంజనేయ స్వామి దేవాలయం తో పాటు పట్టాభి సీతారామచంద్రస్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు, ఈ సందర్భంగా గ్రామాలలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది, జైశ్రీరామ్ జై హనుమాన్ నినాదాలతో గ్రామాలలో భక్తి వాతావరణం నెలకొంది ఈ సందర్భంగా దేవాలయాలలో లక్షబిలార్చన, హోమం వడ్డీ పూజలు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో అర్చకులు శంకరమంచి శేష శర్మ, కాటూరి రామాచార్యులు, శ్రీకాంత్ నాయుడు తో పాటు హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.



# రెండు పడకగదుల సముదాయంలో మౌలిక వసతులు కల్పించాలి

## అధికారులకు అదనపు కలెక్టర్ భాస్కరరావు ఆదేశం

**భూదాన్ పోచంపల్లి, మే 12 (జనంసాక్షి):** ప్రభుత్వం నిర్మించిన రెండు పడకగదుల సముదాయంలో మౌలిక వసతులు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ భాస్కరరావు అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంతో పాటు మండల పరిధిలోని జీబ్లాక్‌పల్లి గ్రామంలోని రెండు పడకగదుల సముదాయాన్ని ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా తాగునీరు, విద్యుత్, మురికికాలువల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, కమిషనర్ అంజన్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఇంట్లో నుండి వెళ్లిన యువకుడు అదృశ్యం

**కొండమల్లేపల్లి, మే 12 (జనంసాక్షి):** ఇంట్లో నుండి వెళ్లిన యువకుడు అదృశ్యమైన సంఘటన మంగళవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొండమల్లేపల్లి గ్రామానికి చెందిన గండూరి రఘు కుమార్ తండ్రి సత్యనారాయణ (42) సవంత్సరాలు మొబైల్ షాపులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య, కూతురు కుమారుడు ఇద్దరు పిల్లలున్నారు. అకస్మాత్తుగా అదృశ్యమైన రఘు సోమవారం రాత్రి కుటుంబ కలహాలతో అలిగి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయాడు. భర్త కనిపించకపోవడంతో అతడి భార్య, కుటుంబ సభ్యులు అతను ఉండే అన్ని ప్రాంతాల్లో వెతికి చూశారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఎంత వెతికినా ఆచూకీ కనిపించకపోవడంతో అదృశ్యమైన రఘు భార్య గండూరి శైలజ తన భర్త ఆచూకీ కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. రఘు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అజ్మీరా రమేష్ తెలిపారు.



# వైభవంగా రేణుక ఎల్లమ్మ కళ్యాణోత్సవం ఘనంగా బోనాలు

### వీర బోనంతో ఆకర్షణగా నిలిచిన సిఐ సీతయ్య

**మునుగోడు మే 12 (జనంసాక్షి)** మండలంలోని చీకటిమామిడి గ్రామంలో బోనాల పండుగ కోలాహలంగా జరిగింది. కుమ్మరి కులస్తుల ఆధ్వర్యంలో బోనాల పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించి రేణుక ఎల్లమ్మ కళ్యాణాన్ని రెండు రోజులపాటు వైభవంగా చేపట్టారు. ఎల్లమ్మ దేవి కళ్యాణం సందర్భంగా కుమ్మరి కులస్తులు కఠిన దీక్షను కొనసాగిస్తూ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టి కోరికన కోరికలు తీర్చాలని మొక్కుకున్నారు. గ్రామాన్ని చల్లగా చూడాలని,సుఖ సంతోషాలతో పాటు పాడి పంటలు సమృద్ధిగా పండేలా చూడాలని ఎల్లమ్మ తల్లికి మొక్కులు మొక్కుకున్నారు. సీఐ సీతయ్య భారీ వీర బోనం ఎత్తి ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు . బైండ్ల వారితో అమ్మవారి కళ్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించి మొక్కలు తీర్చుకున్నారు.గ్రామస్తులు ఆయురారోగ్యాలతో ఉంచాలని అమ్మవారిని వేడుకుంటూ గ్రామంలో బోనాలను ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఎల్లమ్మ తల్లికి నైవేద్యాన్ని సమర్పించి అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. బోనాల ఊరేగింపులో సైపాబాద్ సీఐ ఎరుకొండ సీతయ్య, ఎల్బీనగర్ సీఐ ఎరుకొండ వెంకటయ్య ల నృత్యం చేసి యువతలో ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో కుల పెద్దలు ఎరుకొండ అంజయ్య, భీముడు యాదయ్య, లింగయ్య, ఏపీఎం ఎరుకొండ పుల్లయ్య, చండూరు ఎంపీఓ ఎరుకొండ కోటయ్య, మాజీ ఉపసర్పంచ్ ఎరుకొండ శ్రీనివాస్, ఎరుకొండ సతీష్, టిఆర్ కెఎస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు ఎరుకొండ రవితేజ,నాగరాజు, నగేష్, వెంకన్న, రామకృష్ణ, స్వామి,విజయ్ తదితరులు పాల్గొన్నారు.





# విద్యార్థులు స్వీయ రక్షణ, శారీరక దారుఢ్యం కోసం కరాటే నేర్చుకోవాలి

### సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం

### మునిపంపుల భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో కరాటే శిక్షణ కేంద్రం ప్రారంభం

**రామన్నపేట, మే 12 (జనంసాక్షి):** విద్యార్థులు విద్యతో పాటు శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడం కోసం కరాటే నేర్చుకోవాలని సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం సూచించారు. మండలంలోని మునిపంపుల గ్రామంలో భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో భాగంగా ఉచిత కరాటే శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే వంటి యుద్ధ కళలు విద్యార్థుల్లో ధైర్యాన్ని పెంచడమే కాకుండా స్వీయ రక్షణకు కూడా ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉచితంగా శిక్షణలు అందించడం జరుగుతుందని అన్నారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు క్రీడలు, విజ్ఞానం, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. భవిష్యత్తులో కూడా గ్రామంలో విద్యార్థుల అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలకు గ్రామ పంచాయతీ పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ రాచకొండ రాజు,నాయకులు తాళ్ళపల్లి జితేందర్,గంటెపాక శివ కుమార్,తౌలుపునూరి చంద్ర శేఖర్,బూడిద బిక్షం, జంపాల ఉమాపతి, ఆకుల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# 15 వ ఆర్థిక సంఘం, స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్ పనుల ప్రగతి పై సమీక్ష సమావేశం




**యాదాద్రి, కరస్పాండెంట్ మే 12 (జనంసాక్షి)** పంచాయతీ రాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా ప్రత్యేక అధికారి మరియు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాను సారం జిల్లా పరిషత్తు మరియు మండల పరిషత్తుకు సంభందించిన 15 వ ఆర్థిక సంఘం, స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్ పనుల ప్రగతి పై, సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ రూల్ – 2026 పై అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీ ) భాస్కర్ రావు ఆధ్వర్యములో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య కార్యనిర్వాహనాధికారి శోభారాణి, డిఆర్డిఓ నాగిరెడ్డి , డిఆర్ఓ జయమ్మ, డిపిఓ శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్ వివిధ గ్రాంట్ ల పనులపై సమీక్షించారు. ఈ సమావేశంలో వివిధ మండలాల మండల ప్రత్యేక అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

**వలిగొండ, మే 12 (జనంసాక్షి)** మండలం లో ని వెంకటాపురం గ్రామంలో మత్స్య గిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఉ.8.30 ని.లకు శ్రీ ఆంజనేయస్వామి వారికి 108 కలశాలతో అభిషేకం, ఉ.10.30 ని.లకు శ్రీస్వామి వారికి నాగవల్లి దళార్చన (ఆకుపుజ), అష్టోత్తరం, సింధూరార్చన, ఉ.11.30 ని.లకు శ్రీస్వామి వారికి పల్లకి సేవ కార్యక్రమాలు తదుపరి మ.12.00 గం.లకు మహానివేదన, తీర్థప్రసాద గోష్ఠి అనంతరం భక్తులందరికి అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. దేవస్థానం కార్యనిర్వహణాధికారి సల్వాది మోహన్ బాబు ఒక ప్రకటనలో తెలియచేశారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం గ్రామ సర్పంచ్ కళమ్మ ?యాదయ్య , ఉప సర్పంచ్, వార్డ్ మెంబర్స్, గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# మంత్రి ఉత్తమ్ అభివృద్ధి ఆశయాలను ప్రజల్లోకి తీసుకు వెళ్తా

## జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు గుండు రామాంజిగౌడ్

**హుజూర్ నగర్ , (జనంసాక్షి):** నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అభివృద్ధిని ఆశయాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేలా కృషి చేస్తానని జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు, గరిడేపల్లి మండలం రాయినిగూడెం సర్పంచ్ గుండు రామాంజిగౌడ్ అన్నారు. మంగళవారం హుజూర్ నగర్ సిపిఐ కార్యాలయం లో సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికై, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా గుండు రామాంజి గౌడ్ ను శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గుండు రామాంజి గౌడ్ మాట్లాడుతూ వేలకోట్ల రూపాయల నిధులతో నియోజకవర్గంలో నీటిపారుదల ప్రాజెక్టులు, విద్యా, ఉపాధి కల్పనా అంశాలు, పేదలకు గృహ వైద్య సేవలతో పాటు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు మంత్రి ఉత్తమ్ శ్రీకారం చుట్టారన్నారు. మంత్రి ఉత్తమ్ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో హుజూర్ నగర్‌నియోజకవర్గంలో చరిత్రగా మారుతుందన్నారు. సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శిగా,జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎదిగిన రామాంజిగౌడ్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్,కొప్పోజు సూర్యనారాయణ,చేన్న గాని సైదులు,యల్లావుల రమేష్, నాయకులు గుండు శంభయ్య,ఎస్.కె చాంద్ పాషా,బెక్కం విజయ్, మేకపోతుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



## మధిర లో ఘనంగా ప్రపంచ నర్సింగ్ దినోత్సవ వేడుకలు



**మధిర, మే 12 (జనంసాక్షి) :** వైద్య రంగంలో నర్సుల సహకారాన్ని గుర్తించే లక్ష్యంతో ప్రపంచవ్యాప్తంగ ఏటా మే 12న నిర్వహించే అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని మంగళవారం స్థానిక టీవీఎం హైస్కూల్ నందు కోన సత్య నారాయణ గుప్తా ఫౌండేషన్ అధ్యక్ష, సెక్రటరీ లు కోన నర్సింహా రావు, లక్ష్మి సావిత్రి ఆధ్వర్యంలో లో అంతర్జాతీయ నర్సింగ్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించినారు. ఈ సందర్భంగా మండలం పరిధి లోని పీహెచ్ సీ దెందుకురు ఆరోగ్య సిబ్బంది మరియు వివిధ సబ్ సెంటర్స్ లో పని చేసే నర్సింగ్ ఆఫీసర్స్కు ఇతర వైద్య సిబ్బంది కీ ప్రముఖుల చేతులు మీద గా దుశాలువ మెమంటో తో సత్కారించారు. ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సంరక్షణలో నర్సులు తమ ప్రాణాలను సైతం లెక్క చేయక రోగులకు సేవలను అందిస్తారన్నారు. మనకు ఏ ఆరోగ్య సమస్య వచ్చినా ఆసుపత్రికి వెళ్ళినపుడు డాక్టర్ కన్నా ముందు వచ్చి మనకు సహాయం చేసేది నర్సులే. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ రాసి ఇచ్చాక మనల్ని కంటికిరెప్పలా కాపాడి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా అయ్యే వరకు సేవలు చేసేది కూడా నర్సులే. కోవిడ్ -19 మహమ్మారి సమయంలో నర్సులు పోషించిన పాత్ర, అందించిన సేవలు మన అందరికి తెలిసిన విషయమే. కాబట్టి ఇలాంటి సందర్భాల్లో వారిని సత్కరించడం సన్మానించడం మన విధి అని అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులో సీనియర్ సిటిజన్లకు బీపీ షుగర్ టెస్టులు నిర్వహించి కావలసిన మందులు అందజేశారు ఈ కార్యక్రమం లో డాక్టర్ పృథ్వి రాజ్ నాయక్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీస్ ర్ వి వెంకటేశ్వర్లు టీవీఎం వాకింగ్ క్లబ్ కమిటీ ప్రసిడెంట్ లింగంపల్లి వెంకాయమ్మ విశ్వ నాథం, నర్సింగ్ సిబ్బంది సృజన అరుణ, వి విజయ్ కుమారి వి భారతి, పిపియూ యూనిట్ సిబ్బంది తోట పద్మావతి పంతంగి సంధ్య, జె విజయ్ లక్ష్మి కే రాజేశ్వరి విశ్రాంతి ఉద్యోగులు సుదర్శన్ మరియు కోన సుబ్బారావుకుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## బండి సంజయ్ మంత్రి పదవికి వెంటనే రాజీనామా చేయాలి

### జాతీయ రహదారిపై బీఆర్ఎస్ శ్రేణుల నిరసన

**చంద్రుగొండ,మే 12 (జనంసాక్షి):** మైనర్ బాలికపై అత్యాచారం చేసినట్లుగా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు మేరకు కేంద్ర సహాయక మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ ను వెంటనే అరెస్టు చేయాలని,ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర సహాయక మంత్రి బండి సంజయ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ చంద్రుగొండ మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో విజయవాడ జగదల్పూర్ జాతీయ రహదారిపై నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ మండల అధ్యక్షుడు ధారా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో ఉన్న బండి సంజయ్ కొడుకు పై ఆరోపణలు చేస్తూ ఫిర్యాదు చేసిన ఇప్పటివరకు అరెస్టు చేయకపోవటాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఇప్పటికైనా బండి సంజయ్ తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని అలాగే బండి భగీరథను వెంటనే అరెస్టు చేసి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు నల్లమో?తు వెంకటనారాయణ , నరుకుల్ల సత్యనారాయణ, భూపతి రమేష్, సోయం రజనీకుమారి, మేడ మోహన్రావు, సూరా వెంకటేశ్వర్లు, సత్య నాగేశ్వరరావు, గాదె లింగయ్య, భూపతి శ్రీనివాసరావు,నరుకుల్ల అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు

### చెన్నూరు లో జరిగిన హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్



**కల్లూరు మే 12(జనంసాక్షి)** కల్లూరు మండలంలో హనుమాన్ జయంతి వేడుకలను ప్రజలు సాంప్రదాయబద్ధంగా అత్యంత భక్తి శ్రద్ధలతో అంగరంగ వైభవంగా మంగళవారం జరుపుకున్నారు. కల్లూరు మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో జరిగిన హనుమాన్ జయంతి వేడుకలలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి ప్రభాకర్ చౌదరి, పలువురు మాజీ సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పసుమర్తి మోహన్రావు, శిరసాని జమలయ్య, పసుమర్తి చంద్రరావు, పంచాయతీ వైస్ సర్పంచ్ నలజాల కిషోర్ నల్లజాల మంగపతి, తదితరులతో పాటు కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి పాల్గొన్నారు. ఆలయ అర్చకులు హనుమాన్ భక్త బృందం , జయంతి వేడుకల నిర్వాహకులుఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ కు మంగళ వాయిద్యాలతో సాంప్రదాయ బద్ధం గా ఘనస్వాగతం పలికారు. ఆంజనేయ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే గోత్రనామా లతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆశీర్వాదం తీసుకొని తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా రైతు సోదరులు పండించే పాడి పంటలు సమృద్ధిగా పండాలని, అభయాంజనేయ స్వామి వారి కృపాకటాక్షాలు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని వారు కోరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాకంత బృందం, మహిళలు, పురప్రముఖులు ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయిను శాలువాలతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద చెరువు కట్టమీద గల శ్రీ శివాంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలు ఆలయ నిర్వాహ కమిటీ ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని శ్రీ సంతాన వేణుగోపాల స్వామి ఆలయం నుంచి హనుమాన్ భక్త బృందం ఆధ్వర్యంలో వందలాది భక్తులు జై శ్రీరామ్, జై హనుమాన్ నినాదాలతో ద్విచక్ర వాహనాల తో సమతా ర్యాలీ కల్లూరు పట్టణంలోని పురవీధులలో నేషనల్ హైవే ప్రధాన రహదారి పైన నిర్వహించారు. పెద్ద చెరువు కట్టమీద శ్రీ శివాంజనేయ స్వామి ఆలయం ప్రాంగణంలో గల 49 అడుగుల అభయాంజనేయ స్వామి సన్నిధిలో సదాశివుని పాలెం కు చెందిన శ్రీ లక్ష్మి వెంకటేశ్వర భజనబృందం ఆధ్వర్యంలో భక్తి గీతాల ఆలాపన, 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం వంటి కార్యక్రమాలు అత్యంత రమణీయంగా నిర్వహించారు. ఆలయ పూజారి ఎలమంచిలి వెంకట నాగ సత్య శివకుమార్ (హైటెక్ పూజారి) పలువురు బ్రాహ్మణోత్తముల ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి వేడుకలను పురస్కరించుకొనీ శ్రీ ఆంజనేయ స్వామి మూలవిరాట్ కు, అభిషేకములు, గంధ సింధూరంతో తమలపాకులు, పుష్పములతో ప్రత్యేకపూజలునిర్వహించారు .అర్చనలు, హనుమాన్ చాలీసా పారాయణం, వంటి కార్యక్రమాలు నేత్ర పర్వంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భారీగా తరలివచ్చిన ప్రజలు, భక్తులు హనుమాన్ జయంతి వేడుకలలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ఆలయ నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమము చేపట్టారు.ఈ కార్యక్రమంలోఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు లక్కినేని నరసింహారావు, వలసాల సూర్యనారాయణ, ఉపాధ్యక్షులు మందపాటి మాధవరెడ్డి, వలసాల మోహన్రావు, బయ్యారపు నరేందర్, వలసాల నరేంద్రబాబు, బొల్లం రామారావు, పుచ్చకాయల సత్తిరెడ్డి, పుచ్చకాయల చిన్న మాధవరెడ్డి, మేకల కృష్ణ, లక్కినేని రామకృష్ణ, రామిరెడ్డి , పాపినేని కృష్ణారావు, బొల్లం శంకర్ గౌడ్, లతో పాటు పుర ప్రముఖులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

## జనగణన 2027 హౌస్ మ్యాపింగ్ విధానాన్ని పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్



**కల్లూరు మే 12 (జనంసాక్షి)** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న జనగణన 2027 ప్రక్రియలో భాగంగా నిర్వహిస్తున్న హౌస్ మ్యాపింగ్ విధానాన్ని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ రాజశేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి సిబ్బంది ప్రజల నుండి వివరాల సేకరణ, మ్యాపింగ్ విధానాన్ని ఆయన పరిశీలించి సూచనలు అందించారు. సర్వే ప్రక్రియలో ప్రతి ఇంటి వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి కమిషనర్ సూచించారు. ప్రజలతో సహృదయ భావంతో వ్యవహరిస్తూ అవసరమైన సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడి జనాభా లెక్కల ప్రాముఖ్యతను వివరించారు. హౌస్ మ్యాపింగ్ ద్వారా పట్టణ అభివృద్ధి ప్రణాళికలు సమర్థవంతంగా అమలు చేయడానికి అవసరమైన సమాచారం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. పరిశీలన కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ జిల్లెల్ల స్వాతి, మున్సిపల్ సిబ్బంది, ఫీల్డ్ ఎన్యుమరేటర్లు సూపర్వైజర్లు ప్రజలు పాల్గొన్నారు.

## నేటి తుమ్మల అభిమానుల సభను జయప్రదం చేయండి



**మధిర, మే 12 (జనంసాక్షి)** : తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు గ రాజకీయ జీవితంలో మంత్రిగా 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తుమ్మల గారి అభిమానుల ఆధ్వర్యంలో మే 13 న మధిర రిక్రియేషన్ క్లబ్ కళ్యాణ మండపం లో ఏర్పాటు చేస్తున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి తుమ్మల అభిమానులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల అభిమానులు డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర రావు, జిల్లా నాయకులుమొండితోక సుధాకర్,చెరుకూరి నాగార్జున, మాదాల రామారావు లు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో అలుపెరగని నాయకునిగా, అభివృద్ధి ప్రదాతగా జిల్లా ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్న మంత్రి తుమ్మల అభినందన సభకు మధిర నియోజకవర్గ నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు,తుమ్మల అభిమానులు భారీగా తరలిరావాలని కోరారు. ఈ సభలో మంత్రి తుమ్మల పాల్గొంటారని, సకాలంలో తుమ్మల అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు భోజడ్ల నరేష్, వేముల రాజా తదితరులు పాల్గొన్నారు.

# గ్రీవెన్స్ దినోత్సవంలో ఆర్ఎం కు వినతిపత్రం



**ఖమ్మం, (జనంసాక్షి) :**
రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉపాధ్యక్షుడు, వ్యవస్థాపక నిర్వహణాధికారి ఆదేశాల మేరకు ప్రతి నెల రెండవ మంగళవారం నిర్వహించే గ్రీవెన్స్ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా ఖమ్మం జిల్లా రోడ్డు రవాణా సంస్థ ఆర్ ఎం సరిరామ్ కు తెలంగాణ మజ్దూర్ సంఘం జిల్లా అధ్యక్షుడు మెరుగు రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో కలిసి పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రెండువేల ఇరవై మూడు సంవత్సరంలో ఇచ్చిన ఏడీసీ పదోన్నతుల్లో సీనియారిటీ జాబితాలో తీవ్ర అవకతవకలు జరిగాయని సంఘ నాయకులు జిల్లా నిర్వాహక అధికారి దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగుల సేవా ప్రాధాన్యతను పక్కనపెట్టి జనన తేదీ ఆధారంగా పదోన్నతులు కల్పించడం వల్ల పలువురు సీనియర్ ఉద్యోగులకు అన్యాయం జరిగిందని తెలిపారు. పదిహేనో మార్చి పందొమ్మిదివందల తొంభై, ముప్పైవ మార్చి పందొమ్మిదివందల తొంభై తేదీలలో నియామకం పొందిన ఉద్యోగుల మధ్య ఏర్పడిన సీనియారిటీ వివాదాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించి అర్హులైన వారికి న్యాయం చేయాలని వినతిపత్రంలో కోరారు. అలాగే ఇప్పటికే ఇచ్చిన పదోన్నతులను పునఃసమీక్షించి నిజమైన సీనియారిటీ ప్రకారం సవరించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న పరిపాలనా, సంక్షేమ సమస్యలను కూడా సంఘ నాయకులు జిల్లా నిర్వాహక అధికారికి వివరించారు. వినతిపత్రాన్ని స్వీకరించిన జిల్లా నిర్వాహక అధికారి శ్రీరామ్ సమస్యలను సానుకూలంగా పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్వో

**చంద్రుగొండ, మే 12 (జనంసాక్షి):**
ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చంద్రుగొండను జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని అన్ని రికార్డులు, సేవల నిర్వహణ విధానాలను పరిశీలించారు. ఈ తనిఖీలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాము, హెడ్ నర్స్ శోభాశ్రీ, స్టాఫ్ నర్స్ రమాదేవి, సూపర్వైజర్ బుజ్జమ్మ, ఫార్మసిస్ట్ లక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ ప్రభాకర్ రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. తనిఖీ అనంతరం డీఎంహెచ్వో డాక్టర్ తుకారాం రాథోడ్ పోకలగూడెం సబ్ సెంటర్ పరిధిలో నిర్వహించిన “స్నేహ” కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సునీత, ఎంఎల్హెచ్పీ రమ్యాశ్రీ, ఆశా కార్యకర్తలు మరియు అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రజలకు ఆరోగ్య అవగాహన కల్పిస్తూ వివిధ ఆరోగ్య సేవలను వివరించారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో ఆరోగ్య అవగాహన కార్యక్రమం



**మధిర, మే 12 (జనంసాక్షి) :** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక, విద్యా వారోత్సవాలు రెండవ రోజు మంగళవారం ఆరోగ్య సంబంధిత కార్యక్రమాలలో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మధిరలో మొదటగా యోగా ధ్యాన కార్యక్రమాలు నిర్వహించటం జరిగింది. తదనంతరం శారీరక, మానసిక ఆరోగ్యం పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ వంద పడకల ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రామ్మోహన్ రావు గారు హాజరై సీజనల్ వ్యాధులు, వాటి నివారణ చర్యలపై విద్యార్థులకు వివరించారు. అలాగే మానసిక,ఆరోగ్య సమస్యలను ఎలా ఎదుర్కోవాలి, ఒత్తిడిని ఎలా నియంత్రించుకోవాలి అనే అంశాలపై అవగాహన కల్పిస్తూ ఉపన్యాసం ఇచ్చారు. సభాధ్యక్షులుగా వ్యవహరించిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యంపైనా సమాన శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, పరిశుభ్రత, సమయపాలన సానుకూల ఆలోచనలు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల్లో మంచి చైతన్యం తీసుకువస్తాయని తెలిపారు. కార్యక్రమానంతరం డాక్టర్ రామ్మోహన్ రావు ని ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎస్. ఇందిర, డాక్టర్ పి. సుజాత, డా. వి. నాగరాజు, ఎం. హారిక, ఎస్ జ్యోతి, పి,. మాధురి పి. శ్రీనివాస్, షేక్ ఇమ్రాన్, పి. లక్ష్మీనారాయణ, కె. వెంకటేష్, నాన్–టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా హనుమాన్ జయంతి

చంద్రుగొండ, మే 12 (జనం సాక్షి):
హనుమాన్ జయంతి సందర్భంగా చంద్రుగొండ మండల కేంద్రంలోని శ్రీ హనుమాన్ ఆలయంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి తరలివచ్చి ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు, ఆలయ పూజారి వి.వి.ఆర్.కె. మూర్తి, వేణు ఆధ్వర్యంలో అభిషేకాలు, హనుమాన్ చాలీసా పారాయణం, ప్రత్యేక అలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి పెద్ద ఎత్తున హాజరైన భక్తులకు భోజన సదుపాయం కల్పించారు. హనుమత్ జయంతిని పురస్కరించుకొని ఆలయం నుండి మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా భక్తులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. జై శ్రీరామ్, జై హనుమాన్ నినాదాలతో మండల కేంద్రం మార్మోగింది. యువకులు, మహిళలు, చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొని భక్తి భావాన్ని చాటారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు,గ్రామ పెద్దలు, యువజన సంఘాల సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అరుణ్ ఉన్నత చదువులకు బీర్ల పౌండేషన్ ఆర్థిక సహాయం

### ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హామీ



**యాదగిరిగుట్ట టౌన్ మే 12 ( జనంసాక్షి)**
యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం కేంద్రంలోని శ్రీ గౌతమ్ హై స్కూల్ నిరుపేద విద్యార్థి కొంపల్లి అరుణ్ కుమార్ ఉన్నత చదువులకు బీర్ల పౌండేషన్ ఆర్థిక సహాయం అందిస్తుందని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే మంగళవారం నాడు హామీ ఇచ్చారు. అరుణ్ కుమార్ ఎస్ఎస్.సి పరీక్షల్లో 600మార్కులకు గాను 563 సాధించి టాఫర్ గా నిలిచారు. నిరుపేద విద్యార్థి ఇంటర్ చదువులకు ఆర్థిక సహాయం కోరుతూ శ్రీ గౌతమ్ హై స్కూల్ కరస్పాండెంట్ మిర్యాల దుర్గా ప్రసాద్ విద్యార్థి తల్లి ఝాన్సీ ఎమ్మెల్యేను తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేయడంతో విద్యార్థి అరుణ్ కుమార్ ను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి అభినందించి ఇంటర్ చదువులకు ఆర్థికంగా ఆదుకుంటామని మాట ఇచ్చారు.

## బండి సంజయ్ కుమారుడిని వెంటనే అరెస్టు చేయాలి

### పి.వై.ఎల్ జిల్లా కోశాధికారి పగడాల శివ డిమాండ్



**భూదాన్ పోచంపల్లి, మే 12 (జనం సాక్షి):** కేంద్ర సహాయ హోం శాఖ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథపై నమోదైన కేసులో వెంటనే అరెస్టు చేసి నిష్పక్షపాత విచారణ జరపాలని ప్రగతిశీల యువజన సంఘం (పి.వై.ఎల్) జిల్లా కోశాధికారి పగడాల శివ డిమాండ్ చేశారు. భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడిన ఆయన, మైనర్ బాలిక ఇచ్చిన ఫిర్యాదుపై ప్రభుత్వం, పోలీసులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. సాధారణ వ్యక్తుల కేసుల్లో వేగంగా స్పందించే ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల కుటుంబాలకు సంబంధించిన కేసుల్లో మాత్రం ఆలస్యం చేయడం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోందన్నారు. బాధితురాలు మరియు ఆమె కుటుంబానికి రక్షణ కల్పించి, ఒత్తిళ్లు లేకుండా విచారణ జరిపించాలని కోరారు. అలాగే, కేసు నమోదైన కొన్ని రోజుల తర్వాత మాత్రమే సిట్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడం కూడా అనుమానాలకు దారితీస్తోందన్నారు. ప్రజాస్వామ్య దేశంలో చట్టం అందరికీ సమానంగా ఉండాలని, పదవులు లేదా రాజకీయ ప్రభావం ఆధారంగా వ్యవహరించడం సరికాదన్నారు కేసుపై నిష్పక్షపాత దర్యాప్తు చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ముచ్చవరంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం

**కల్లూరు మే 12(జనంసాక్షి)..**
కల్లూరు మండల పరిధిలోని ముచ్చవరం గ్రామంలోవ్యవసాయ కళాశాల, అశ్వరావుపేట వారి ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు, డాక్టర్ జె. హేమంత కుమార్, డాక్టర్ టి. శ్రవణ్ కుమార్, వ్యవసాయ అధికారిని మాదాబత్తుల రూప గ్రామ సర్పంచి శీలం కోటేశ్వరమ్మ, తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డాక్టర్ జె. హేమంత కుమార్ మాట్లాడుతూ రైతులు భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా సిఫార్సు చేసిన మేర ఎరువులను, యూరియాను భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా తగిన మోతాదులో దఫాలుగా కొద్దికొద్దిగా వేసుకోవడం ద్వారా పంట ఏపుగా పెరిగి నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చు అన్నారు. అదేవిధంగా పంటలను ఆశించే చీడపీడల ఉధృతి కూడా తగ్గి తద్వారా సాగు ఖర్చులు తగ్గటంతో పాటు నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడుకో వచ్చుని పేర్కొన్నారు. రైతులు సాగునీటి యాజమాన్యంలో ప్రత్యేక శ్రద్ధ చూపి నీటిని పొదుపుగా వినియోగించడం ద్వారా భావితరాల భవిష్యత్తు కాపాడవచ్చు అన్నారు. శాస్త్రవేత్త డాక్టర్ టి. శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ రైతు సోదరులు తమకు కావలసినటువంటి విత్తనాలు, రసాయనాలు కొనుగోలు చేసేటప్పుడు , తమ పంట ఉత్పత్తులను అమ్మేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి అన్నారు. ప్రస్తుతం మన రాష్ట్రంలో సాగుకు అనువైనటువంటి, మంచి గిరాకీ ఉన్న వరి విత్తన రకాలు వాటి లక్షణాలను వివరించారు. మండల వ్యవసాయ అధికారిని మాదాబత్తుల రూప మాట్లాడుతూ రైతు సోదరులు ఏళ్ల తరబడి ఒకే రకం పంట వేయకుండా కనీసం మూడు సంవత్సరాలకు ఒకసారి పంట మార్పిడి చేయాలి అన్నారు. పంట మార్పిడి వల్ల భూసారం పెరిగి చీడపీడల ఉధృతి తగ్గి దిగుబడులు పెరిగే అవకాశం ఉంది అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ వైకంటి శ్రీనివాసరావు వ్యవసాయ





విస్తరణ అధికారి మోదుగు పవన్ కళ్యాణ్, బండి శ్రీను, ముచ్చవరం గ్రామ రైతు సోదరులు , వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## సింగరేణి ఇంచార్జ్ ఎంపీడీవోగా మల్లెల రవీంద్ర ప్రసాద్



కారేపల్లి, మే12(జనంసాక్షి) : సింగరేణి మండల ఎంపీడీవో గా ఎంపీవో మల్లెల రవీంద్ర ప్రసాద్ మంగళవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. సింగరేణి ఎంపీడీవోగా పని చేసిన పి.శ్రీనివాస్ పదోన్నతి పొంది ఖమ్మం జిల్లా డిప్యూటీ సీఈవోగా నియమితులయ్యారు. ప్రస్తుతం సింగరేణి మండల ఎంపీవోగా సేవలందిస్తున్న మల్లెల రవీంద్ర ప్రసాద్‌కు ఇం చార్జ్ ఎంపీడీవో బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మల్లెల రవీంద్ర ప్రసాద్ కార్యాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులతో సమావేశమై మండల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసే దిశగా కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, తోటి అధికారులు, సిబ్బందిపుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## పంట మార్పిడితో ప్రయోజనం

**ప్రభుత్వం సూచించిన వంగడాలనే వేయండి**

**అప్పాయిగూడెంలో రైతు ముంగిట్లో శాస్త్రవేతలు**

కారేపల్లి, మే12(జనంసాక్షి) : పంట మార్పిడితో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వైరా కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన వన శాస్త్రవేత డాక్టర్ వి.చైతన్య అన్నారు. మంగళవారం సింగరేణి మండలం అప్పాయిగూడెంలో రైతు ముంగిట్లో శాస్త్రవేతలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ చైతన్య మాట్లాడుతూ పంట మార్పిడితో తగిన మోతాదులో పోషకాల వినియోగం జరుగుతుందన్నారు. ప్రభుత్వం సూచించిన వరి వంగడాలను వేయాలన్నారు. వాటితో మంచి దిగుబడితో పాటు ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవన్నారు. సేంద్రియ విధానంలో పంటల సాగుచేయటం పర్యవరణానికి ఎంతో మేలన్నారు. యూరియా వాడకంతో మానవ ఆరోగ్యంపై ప్రభావం ఉంటుందని యూరియ వాడకం తగ్గించి పంట పెట్టుబడి తగ్గించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ దండు ప్రవీణ్, ఏఈవో లు షేక్ మున్నీ, బానోత్ మహేష్, ఎం. చంద్రకళ, బి.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## విశ్వనాధపల్లి జీపీ దుకాణాల అద్దెకు వేలం



కారేపల్లి, మే12(జనంసాక్షి): విశ్వనాథపల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలోని కారేపల్లి క్రాస్‌రోడ్ ఉన్న దుకాణ సముదాయాలకు బుధవారం వేలం పాట నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ ఇస్లావత్ రాజు, కార్యదర్శి నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ కారేపల్లి క్రాస్ రోడ్డు లోని మూడు షాపింగ్ కాంప్లెక్స్ లకు వ్యాపార పరంగా వ్యాపారాలు నిర్వహించేందుకు అవసరమైన పద్దతిలో వాటిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వ్యాపారానికి సంబంధించిన వ్యాపారస్తులు బుధవారం విశ్వనాధపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగే వేలం పాటలలో పాల్గొని దుకాణ సముదాయాలను సొంతం చేసుకోవాల్సిందిగా వారు కోరారు. ఈ వేలంపాటలకు డీపీవో రాంబాబు, ఇంచార్జీ ఎంపీడీవో మల్లెల రవీంద్రప్రసాద్ హాజరవుతారని తెలిపారు.

## ఐకెపి ధాన్యం దిగుమతులు నిర్లక్ష్యం, ఆలస్యం చేస్తే ఉపేక్షించేది లేదు

**మిల్లర్లకు ఆర్డిఓ. ఆర్.వేణుమాధవ్ కీలక ఆదేశాలు**

పెన్ పహాడ్, మే 12 (జనం సాక్షి ) : ధాన్యం దిగుమతులు నిర్లక్ష్యం, ఆలస్యం చేస్తే ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని సూర్యాపేట జిల్లా ఆర్డిఓ. ఆర్. వేణుమాధవ్ అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని వేదాంతీ రైస్ మిల్ న్యూ బంజారాహిల్స్ , సువర్ణ జ్యోతి రైస్ మిల్ న్యూ బంజర హిల్స్, మాచారం సంతోషిమాత రైస్ మిల్ , వెంకట సాయి రైస్ మిల్. మహాదేవ రైస్ మిల్ అనంతారం ఎక్స్ రోడ్ రైస్ మిల్ లను తహసిల్దార్ ఉమ్మి రాజశేఖర్ రెడ్డి తో కలిసి పరిశీలించారు.ఇప్పటివరకు కేటాయించిన ధాన్యం కన్నా అదనపు కోటాను సంబంధిత మిల్లులకు కేటాయించడం జరిగిందని తెలిపారు. ధాన్యం దిగుమతులు ఆలస్యం చేయడం వల్ల మిల్లుల ముందు లారీలు రోజుల తరబడి ఆలస్యం అవుతుందని త్వరగా దిగుమతి చేసుకోవాలని హెచ్చరించారు. దిగుమతులు ఆలస్యం కావడం తో లారీల కొరత ఏర్పడుతుందని తద్వారా కొనుగోలు కేంద్రా లలో ధాన్యం రాశులు పేరుకుపోయాయని రైతులు ఆందోళన చేస్తున్నారని వివరించారు. వర్షాకాలం సమిపిస్తున్నందున కొనుగోలు కేంద్రాలలో కాంటాలు, వేసిన బస్తాలు,ధాన్యం రాశు లు వర్షాలకు తడిసి రైతులు నష్టపోయే అవకాశం ఉందని అన్నారు. దిగుమతులు ఆలస్యం చేస్తే ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఆమె వెంట ఎఆర్ఐ అజీజా బేగం, ఎఎస్ఓ నవీన్ సిబ్బంది ఉన్నారు.



## మృతురాలి కుటుంబానికి నాయకుల పరామర్శ

కారేపల్లి, మే12 (జనంసాక్షి) : కారేపల్లి మండలం మాణిక్యారం గుడి తండా గ్రామానికి చెందిన తేజావత్ సక్రి అనారోగ్యంతో మఱతి చెందగా ఆమె సంస్మరణ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కె.నరేంద్ర, నాయకులు వజ్జా రామారావు, పోతర్ల నాగేశ్వరరావు, భూక్యా రమేష్, భూక్యా సాయి, సర్పంచ్ భూక్యా వాచ్యాపద్మ హాజరై సక్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. మఱతురాలు భర్త సామ్య నాయక్, కుమారులు పుల్లయ్య,రాంబాబు లకు సానుభూతి తెలిపారు.





## మహాత్మా గాంధీ ఉపాధి హామీ ని కొనసాగించాలి కార్మిక సంఘాలు

రాజాపేట, మే12(జనంసాక్షి): కేంద్ర ప్రభుత్వం చేస్తున్న పాత చట్టాన్ని రద్దుచేసి విబి రాంజీ చట్టాన్ని తీసుకువచ్చిన దాన్ని రద్దు చేసి పాత పద్దతి పాత చట్టమైన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీని కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జూకంటి పౌల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పాత చట్టాన్ని రద్దుచేసి విబి రాంజీ చట్టాన్ని తీసుకొచ్చి దాని రద్దుచేసి పాత చట్టం అయినా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ హామీ కొనసాగించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి కార్మికులు గ్రామీణ ప్రాంతంలో సంపద సృష్టిలో కీలకపాత్ర పోషిస్తున్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నారని, ఉపాధి హామీ ద్వారా చెరువులో పూడికతీత గట్ల నిర్మాణాలు మట్టి పనులు రహదారులు కాలువలు నిర్మాణం పేదల భూములను అభివృద్ధి, మొక్కలు నాటడం వంటి పనుల ద్వారా ఉపాధి కూలీలు గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత ఆస్తులను పెంచుకుంటున్నారన్నారు. ఇలాంటి అభివృద్ధి కీలక పాత్ర పోషిస్తున్న కుటుంబాలను పోషించుకుంటున్నారని, కార్మికుల పొట్టగొట్టి ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేసే బి.రాంజీ పథకాన్ని పథకం తెచ్చి కొత్త కొత్త జీవోలతో కార్మికులను పనికి దూరం చేస్తున్నారని పని ప్రదేశాల్లో మౌలిక వసతులు ఎత్తివేసి కార్మికుల ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు. చేసిన పనికి కూలి ఎంత వస్తుందో చెప్పకుండా వారం వారం డబ్బులు ఇవ్వకుండా కార్మికుల అవస్థల పాలు చేస్తున్నారని, ఇప్పటికైనా ఉపాధి హామీ కార్మికుల సమస్యలను పరిష్కరించి పాత చట్టాన్ని కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు ఈ నెల 15 జరిగే గ్రామీణ సమ్మె బందును జయప్రదం చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కట్ట రవికుమార్ మండల అధ్యక్షులు గంధ మల్ల రాజయ్య సహాయ కార్యదర్శి ఎంజాయ్ మైసయ్య గొల్లూరి ప్రభాకర్ ముఖ్య సలహాదారుడు బి రాములు పరమేష్ మధు శ్రీకాంత్ ఉమా మహేశ్వర్ లక్ష్మయ్య పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నీట్ యూజీ 2026 పరీక్ష రద్దు

## మళ్లీ పరీక్ష నిర్వహణకు కేంద్రం నిర్ణయం

## పేపరు లీకేజీ కారణం

నల్లగొండ ప్రతినిధి, మే 12,(జనంసాక్షి): దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు హాజరైన నీట్ యూజీ 2026 పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఔం) రద్దు చేసింది. పరీక్ష నిర్వహణలో జరిగిన అనుమానాస్పద పరిణామాలు, అక్రమాల ఆరోపణలు మరియు కేంద్ర దర్యాప్తు సంస్థల నివేదికల నేపథ్యంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు ఔం ప్రకటించింది.మరో ప్రకటన విడుదల చేసిన ఔం, పరీక్ష ప్రక్రియపై వచ్చిన ఫిర్యాదులను కేంద్ర సంస్థలకు అప్పగించి స్వతంత్ర విచారణ జరిపినట్లు తెలిపింది. కేంద్ర దర్యాప్తు సంస్థలు అందించిన వివరాలు, చట్ట అమలు సంస్థల నివేదికలు పరిశీలించిన అనంతరం ప్రస్తుతం నిర్వహించిన పరీక్ష ప్రక్రియను కొనసాగించడం సాధ్యం కాదని తేలిందని వెల్లడించింది.దీంతో ఔఇఖ (ఙఉ) 2026 పరీక్షను పూర్తిగా రద్దు చేసి, మళ్లీ నిర్వహించాలని నిర్ణయించినట్లు స్పష్టం చేసింది. పునఃపరీక్ష తేదీలు, కొత్త అడ్మిట్ కార్డుల విడుదల షెడ్యూల్‌ను త్వరలో అధికారిక వెబ్‌సైట్ మరియు ఇతర అధికారిక ఛానళ్ల ద్వారా ప్రకటించనున్నట్లు తెలిపింది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ కోసం కేంద్ర ప్రభుత్వం కేసును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (అఃఎ)కు అప్పగించింది. విచారణకు అవసరమైన అన్ని రికార్డులు, సమాచారం, సాంకేతిక సహకారం అందించేందుకు ఔం సిద్ధంగా ఉందని వెల్లడించింది.విద్యార్థుల ప్రయోజనాలు, జాతీయ పరీక్షా వ్యవస్థపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఔం పేర్కొంది. పరీక్షను మళ్లీ నిర్వహించడం వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులకు ఇబ్బందులు కలుగుతాయని తెలుసునని, అయినప్పటికీ వ్యవస్థపై విశ్వాసం దెబ్బతినకుండా ఉండాలంటే ఈ నిర్ణయం అవసరమైందని వివరించింది.ఇప్పటికే దరఖాస్తు చేసిన అభ్యర్థుల రిజిస్ట్రేషన్, ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాలు అలాగే కొనసాగుతాయని స్పష్టం చేసింది. కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని, అదనపు పరీక్ష ఫీజు కూడా వసూలు చేయబోమని తెలిపింది. ఇప్పటికే చెల్లించిన పరీక్ష ఫీజులను విద్యార్థులకు తిరిగి చెల్లించనున్నట్లు ప్రకటించింది.సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న అసత్య వార్తలు, పుకార్లను నమ్మవద్దని విద్యార్థులు, తల్లిదండ్రులకు ఔం సూచించింది. అన్ని అధికారిక వివరాలు ఔం అధికారిక వెబ్‌సైట్ మరియు అధికారిక ప్రకటనల ద్వారానే అందిస్తామని తెలిపింది.

**నీట్ ని ఆన్లైన్ చేయాలని డిమాండ్:**

జేఈఈ మెయిన్స్ పరీక్ష విధానము గా నీట్ ని కూడా ఆన్లైన్ పద్దతిలో నిర్వహించాలని పలువురు విద్యార్థులు కోరుతున్నారు.విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లినట్లు ఉంది అని అంటున్నారు కానీ విద్యార్థులు ఆత్మస్థైర్యం తో పరీక్ష ను రాసి ఆందోళన చెందకుండా ఉండాలని మళ్ళీ పరీక్ష కు సంసిద్ధం అవ్వాలని ప్రిపరేషన్ బాగా చేసుకోవాలని జనం సాక్షి కోరుతుంది.